# దొడ్డతాంబూ — హోమము

కొడవటిగంటి కుటుంబరావు

మనమంటే ముసలాళ్లమైపోయినాం; అనుభవం వచ్చేసింది; నేత్ర—ఉత్తుత్త చూసుకోటాల్లో మన కానందమూ నమ్మకమూ పోయింది. కాని కుర్రాళ్ల కంత నిబ్బరం ఉండమంటే ఉంటుందా? పొంగి చల్లారిన పాలల్లే పచ్చిపాలెందుకుంటై?

శ్రీనివాసరావు మా రిటైర్డు డిప్టీ కలెక్టరుగారి మేడ మీది గదిలో ఉండేవాడు. అసలా మేడ కలెక్టరుగారిది కాదు కాని ఇంటాయన శతకోటి లింగాల్లో ఓ బోడి లింగం కావటంచేత కలెక్టరుగారి మేడ అనటం వాడుక. అదెక్కువ మేడ కాదు, చూశారో లేదో. "మన కథా కాలంనాటికి" రెండు మూడేళ్ల కిందటకూడా డాబా గానే ఉండేది. తరువాత డాబా పడమటివైపున ఒక చిన్న గది నిర్మించబడ్డది. తూర్పు ముప్పాతికా డాబా గానే ఉంటున్నది. కింద నివసించేవాళ్లతో ప్రమేయం లేకుండా మెట్లు పక్కనించే పైకి పోతై. ఈభవంతికి ఇంటి నానుకుని దక్షిణాన ఒకరోడ్డూ పడమట ఒకగల్లీ అంటే శ్రీనివాసరావు తన గదిలోనించి దక్షిణపు కిటికీలగుండా రోడ్డుమీదికీ, పడమటి కిటికీకుండా గల్లీలోకీ, ఉత్తరపు కిటికీలగుండా కలెక్టరుగారి దొడ్డిలోకీ చూడవచ్చును. ఆ మర్నాడు స్నేహితుల కాతిథ్యం ఇచ్చి సంగీతాలు పాడించినప్పుడూ, ఈజిల్ ముందు కూర్చుని పాలెట్ మీద సున్నితమైన రంగులు సృష్టించినప్పుడూ, పైచెప్ప బడ్డ కిటికీలలో ఉత్తరపు వాటిముందు కూర్చుని కలెక్టరు గారి దొడ్లోకి చూస్తూ నిట్టూర్చేవాడు.

కలెక్టరుగారి మూడో భార్య ద్రౌపది. ఈడులో ఉన్న పిల్ల, చక్కంది, లోలకులుకూడా పెట్టుకునేది! ఆ లోలకు లేకపోతే శ్రీనివాసరావు తపన కాస్త తగ్గేదేమో! ఆ పిల్ల అతనిమనస్సులో ఒక రావణాసురుడి కాష్టం రగిల్చింది. అది చల్లారే ఉపాయం కనిపించలేదు.

శ్రీనివాసరావు బాధ సులభంగా ఊహించుకోవచ్చును. అసలే ఆర్టిస్టూ, కుర్రవాడూ, అంతవరకూ హృదయం ఎవరికీ కోల్పోయినవాడు కాదూ, చిన్నపిల్లా, అందగత్తే



ముసలి మొగుడితో కాపరం! ఇంతకంటె శ్రీనివాస రావును దహించేటందు కేం కావాలి!

ద్రౌపది రోజుకు వందసార్లు దొడ్లో కెందుకు రాదు? అతను చూసినంతమాత్రాన తను అరిగిపొయ్యే దేముంది? అత నంతకన్న ఎక్కువ కోరలేదే?

అసలే దృఢకాయుడు, ఈ జ్వాలలోపల ప్రవేశించి నప్పటినించీ మామూలుకు నాలుగింతలు ఎక్సర్ సైజు చెయ్యటం మొదలు పెట్టాడు. అట్లా కొంత సుఖంగా ఉండేది. ద్రౌపది జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతని కండరాలు తాచు పాములల్లే ఉబ్బుకొచ్చేవి. అడ్డం వచ్చినవాళ్లను కాలితో నేల రాచి ద్రౌపదిని ఎత్తుకు పోదా మన్నంత ఉద్రేకం వచ్చేది.

కొంతకాలంనించీ శ్రీనివాసరావుకు బొమ్మలు రాయ టంలో కూడా శ్రద్ధ తగ్గింది. ఒకసారి పెనసలు తీసుకుని స్కెచ్ ఒకటి గీద్దామని ప్రయత్నం చేసేటప్పటికి ద్రౌపది సాక్షాత్కరించింది.


ఒక పండు వెన్నెలనాడు నంబూరి సుబ్బారావుకు ప్రాణస్నేహితు డొకతను శ్రీనివాసరావుగది కొచ్చాడు. ఆ డాబామీద వాళ్ళూ వీళ్ళూ అంతా కూర్చున్నారు. ఆ కొత్తతను శ్రావ్యమైన శారీరంతో "యెంకి వంటి పిల్ల" అనే పదం పాడాడు. "నా సామ్మి నా గుండె నమిలి మింగిన పిల్ల"అని అతను పాడేటప్పటికి చంద్రుడి వంక చూస్తున్న శ్రీనివాసరావు కళ్లల్లోకి కడివెడు నీళ్లు దిగినై. అత డక్కణ్ణించి జారుకుని గదిలో మంచంమీద బోర్లా పడుకున్నాడు.

"నా సామ్మి—నాగుండె నమిలి మింగిన పిల్ల!"అట్లా మాటల్ని భావాల్లో పెట్టడం మర్యాగం కాదూ! తన ప్రాణప్రదమైన రహస్యం—అందరి చెవులకోసమూ విని యోగింప బడుతున్నది!

ఒక రోజు సాయంకాలం అతను మామూలు ప్రకారం షికారుకు పోలేదు. ఆ ఉత్తరపువైపు కిటికీముందు కూర్చుని అదే చూడటం. అతని ఆలోచన లెక్కడికో షికారు వెళ్లినై. సూర్యాస్తమానమయింది. అతని గదిలో చీకటి పడ్డదికూడాను. కాకులు గోలచేస్తూ చెట్లమీద వచ్చి వాలుతున్నై.

శ్రీనివాసరావు చావ గొట్టినట్టు ఉలిక్కి పడ్డాడు. ద్రౌపది దొడ్లోకి వచ్చింది. కిటికీ కమ్మిలమీద శ్రీనివాస రావు చేతిపట్టు బిగిసింది. అతని జీవాలు కళ్లలో ప్రవే శించి కూర్చున్నై.

ద్రౌపది ఒక తువాలా మల్లె పందిలిమీద వేసింది. సబ్బుపెట్టె నూతి బొడ్డుమీద పెట్టి ఒక కాగులోకి నీళ్లు తోడుకుంది. తరువాత ఆకాగు స్నానంచేసే రాతి పక్కగా ఈడ్చి ఇవతలికొచ్చి మెల్లిగా కట్టుకున్న చీర విప్పి దాన్ని కూడా మల్లె పందిరిమీద వేసి ఒంటిమీద నీళ్లు పోసుకో వటం మొదలు పెట్టింది.



ద్రౌపది ఒంటిమీది బట్టతోపాటు శ్రీనివాసరావులో నించి నాగరికతా జారిపోయింది. అప్పు డెవరన్నా అతన్ని చూస్తే దడుచుకుని ఉంటారు. ఆకలిగా ఉన్న సింహం ఎరమీద దూకబోతుంటే ఎట్లా ఉంటుందో ఇత నట్లా ఉన్నాడు. అతని కళ్లు జ్యోతులల్లే ప్రకాశిస్తున్నై. అతనిదీ ఒక విధమైన ఆకలే! నగ్నస్త్రీ కనిపించగానే అవతలకి పోవలసిన బాధ్యత, నాగరికత తనమీద వేసిం దని అతనికి తట్టలేదు. అతనికి సంబంధించినంతవరకూ అది 1932-వ సంవత్సరం కాదు, అతను కళాభ్యాసి కాడు, ఇది హిందూదేశం కాదు. అతను ఆకలిమీద నున్న మగ వాడూ, అతని కళ్లంతా ఆక్రమించుమని ఉన్న ఆకారం అతని ఆహారమూ! కిటికీలకు చువ్వలులేకుండా ఉంటే...

ద్రౌపది తల ఎత్తి చూసింది! ఆశ్చర్యం ఏమీ లేదు. అతని చూపు ఎర్రగా కాలిన ఇనుమల్లే ఆమెకు తగిలి ఉండాలి!

అతన్ని చూడగానే ఆమె ముహం అవమానంతో, పాపం, వికారంగా మారింది. ఆ మార్పు శ్రీనివాసరావు మీద భయంకరంగా పని చేసింది—వేడి ఇనుముమీద

చన్నీళ్లు పడినై. ఒక్క క్షణంలో పోయిన నాగరకత యావత్తూ మణుగుబరువున మీద పడింది. అతను చూస్తుండగానే ద్రౌపది స్నానం పూర్తి చెయ్యకుండానే చీర చుట్టుకుని తల వంచుకుని లోపలికి వెళ్లి పోయింది.

శ్రీనివాసరావు పక్కమీద బోర్లపడి ఏడవటం మొదలు పెట్టాడు. తన కెందు కీబాధ? పాప ఫలితం! ఆమె తన్ను చూడకపోతే తాను చేసిన పని పాపమూ అయేది కాదు, దానికి ఫలితమూ ఉండేది కాదు. అదివరకు మాదిరిగా ఇప్పుడు ద్రౌపది తన మనసులో పవిత్రస్థానం ఆక్రమించుకోలేదు. ద్రౌపది అపవిత్ర అయిందా? కాదు. తన మనసులో పవిత్రస్థానమంటూ లేకుండా పోయింది. ఎవరూ చూడకుండా చేసేపనికీ చూసేటట్టు చేసేదానికీ తేడా లేదంటారే, మూర్ఖులు! తనాపని చేసేటప్పుడు తన మనస్సు నిర్మలంగానే ఉంది. ద్రౌపది చూడగానే...

దాదాపు రెండుగంటలసేపట్లా ఉన్నాడు. ఆ తరువాత శరీరం విదిలించుకుని లేచి కలం కాగితం తీసుకుని రాయటం మొదలు పెట్టాడు.

“అమ్మా! నేనేం చేస్తున్నానో నాకు తెలియదు. చేతయితే ఈసారికి నన్ను క్షమించు. ఇక ఇటువంటి పని జరగదు!”

ద్రౌపదిని అమ్మా, అని సంబోధించటం అతని కసాధ్యం కాలేదు. అంతకన్న ఇంకోచుట్టరికం లేదిప్పుడు. ఒకనాడు అతను వీధిన నడుస్తుండగా ఒక స్త్రీని రాచుకు పోవటం జరిగింది. అతను కంగారు పడి వెనక్కు తిరిగి చూశాడు. ఆమెకూడా వెనక్కు తిరిగిచూసి, నవ్వి, సాగి పోయింది.

ద్రౌపది అమ్మవరసే. వెంటనే అతను మెట్లుదిగి సందులోకి వెళ్ళి కిటికీగుండా ఆ కాగితం ముక్క కలెక్టరుగారి పడక గదిలో పడేశాడు.

రాత్రి పదిగంట లప్పుడు అతని గదిముందు చప్పుడయింది. ఎవరో తలుపు తట్టారు. ఒక లాంతరూ ఇద్దరు మగవాళ్ళూ. అందులో ఒకడు కలెక్టరుగారే, రెండోవాడెవరో తెలియలేదు. అప్పుడప్పుడు వాళ్ళింటికి వస్తుండే వాడు; ఏం చుట్టమో?

శ్రీనివాసరావు కంతా అర్థమయింది. చేసేది లేక కాగలదాని కెదురు చూస్తూ నిలబడ్డాడు. నువ్వు చెప్పమంటే నువ్వు చెప్పమన్నట్టు ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. శ్రీనివాసరావులో భయలేశ మేదైనా ఉంటే పోయి నవ్వు వచ్చింది.

చివరకు రెండో అతనే ముందుకొచ్చి మాట్లాడటం మొదలు పెట్టాడు.

“ఇదుగో—నీపేరేమిటో—నువ్వెందు కివాళ్ల—ఈయన భార్య—గారు—స్నానం చేస్తుండగా”—

“ఈ సారి ఇటువంటి”—అని కలెక్టరుగారు అడ్డం వచ్చాడు.

“ఈ సారిదాకా పోతున్నారా? వెధవను, ఇప్పుడే—”

“మాటలు సరిగా రానివ్వండి!” అన్నాడు శ్రీనివాసరావు.

“ఛీ! పేల్తావా?” అని ఆ రెండోవాడు శ్రీనివాసరావుమీద చెయ్యి వేశాడు. శ్రీనివాసరావు ఫెడేల్‌మని అతని దవడమీద పేల్చాడు. ఒక్కక్షణం ఇద్దరూ నిర్ఘాంతపోయి నిలుచున్నారు. ఆ తరువాత ఏకగ్రీవంగా ఇద్దరూ వీపు తిప్పి పరిగెత్తటం మొదలు పెట్టారు. శ్రీనివాసరావు బిగ్గరగా నవ్వటం మొదలు పెట్టాడు.

మెట్లమీద కలెక్టరుగారు కూకలేస్తున్నాడు రెండో ఆయన్ను.

“నే చెబితే వింటావా! కాదు కూడదు, వెధవకు బుద్ధి చెప్పాలంటివి! సామెత చెబుతాడే, అశుద్ధంమీద—”

“వెధవమీద పోలీసు రిపోర్టిస్తాను—”

ఆ సమయానికి ద్రౌపది తన గదిలో చిన్న కాగితం ముక్క చదువుకుంటున్నది—పశ్చాత్తాపంతో! మొగుడితో ఎందుకు చెప్పిందో ఆమెకే తెలియలేదు. ఇక ఆ అబ్బాయి తనవంక చూడడు! ఆడవాళ్లకు చదువూ సంధ్యా లేకపోవడంవల్ల ఇటువంటి అవివేకం జరుగుతూంటుంది! ఛత్!

ద్రౌపదికి ఈతప్పు దిద్దుకోవటం ఎట్లాగో తెలియలేదు. దొడ్లోకి నూరుసార్లు వచ్చేది. రోజూ తప్పకుండా మేడమీదికి చూసేది. అతను కనపడితే నవ్వేది.

శ్రీనివాసరావు గుండెమీద చెయ్యి పెట్టుకుని “నా చెల్లెలు నన్ను క్షమించింది!” అనుకునేవాడు. అతని చర్య ద్రౌపదికి అర్థం కాలేదు. ఏమి అతని ఉద్దేశం? అతను వీలు చూసుకుని తన దగ్గర కెందుకు రాడు? మొగుడితో చెప్పినందుకు తనమీద పగ పట్టాడా? మరి ఇతను

నవ్వితే తిరిగి నవ్వుతాడే? లేక ఇంకా ఈ తరం రాసిన నాటి ధోరణిలోనే ఉన్నాడా! మగవాడింతకాలం ఆ విధంగా ఉండగలడా? తన్నేడిపిస్తున్నాడా? ద్రౌపదికి రోషం వచ్చింది!

"గణపతి ఉన్నాడు కాని, ఆ కుర్రవాడు......"

రెండు మూడు నెలలు గడిచినై. ఒకనాడుదయం కలెక్టరుగారు గ్రామాంతరం వెళ్ళాడు. శ్రీనివాసరావు కానాడు నిదర పట్టలేదు. పాపం, ద్రౌపది ఒంటరిగా ఉంటుంది! ఎంత బుద్ధిమంతురాలు! యాభై అయిదేళ్ళ మొగుడు!

రాత్రి పదిగంటలైంది. కలెక్టరుగారి దొడ్డి తలుపెవరో తట్టిన చప్పుడయింది. పడమటి కిటికీ దగ్గిరికి వెళ్ళి చూశాడు. చీకట్లో ఎవరో నుంచున్నట్టుంది. కాని స్పష్టంగా కనపడటం లేదు.

మెల్లిగా ఇంటి దొడ్డివాకిలి తీసుకుని ద్రౌపది బయటికొచ్చి దొడ్డి వీధి వాకిలి తెరిచింది. ఎవరో లోపలికొచ్చాడు! మగవాడే! హరి, వీడి దుంప తెగా! వినాయకుడా, విఘ్నేశ్వరుడా......? గణపతి! తనమీద చెయ్యి వేసిన కుంక! శ్రీనివాసరావు హృదయం కుంగిపోయింది. ఆహా! ఎంత మంచి ఇల్లాలు!

శ్రీనివాసరావు గదిలో దీపం లేకపోవటం ఎంతో మేలయింది. ఉంటే అతన్ని చూసి ఉండేవాళ్ళే!

పదకొండు! ఈరాత్రి జాగారమే.........

పన్నెండు! దూరాన బండి చప్పుడు. మరో అయిదు నిమిషాల్లో ఒక బండి వచ్చి కలెక్టరుగారి వీధి గుమ్మంముందాగింది. దాన్లోనుంచి కలెక్టరుగారు దిగాడు! ఆయనే అనుమానమెందుకూ?

"తలుపు! తలుపు!"

శ్రీనివాసరావు గుండెల్లో రైళ్ళు పరిగెత్తినై.

"తలుపు! తలుపు!"

దొడ్డి వాకిలి తెరుచుకుంది. గణపతీ ద్రౌపదీ దొడ్లోకి వచ్చారు. కలెక్టరుగారు దొడ్డి తలుపు తట్టటానికి చుట్టూ తిరిగి వస్తున్నాడు! శ్రీనివాసరావు గబగబా బయటికొచ్చి వాళ్ళ దొడ్లోకి ఎగిరి దూకాడు. దొరికిపోయిన దొంగలిద్దరూ నిలువునా కొయ్యబారిపోయినారు. శ్రీనివాసరావు




వాళ్ళను గమనించే వ్యవధి లేదు. లోపలికి పోయి రంపంగల్లో లాంతరు పెద్దది చేసి తీసుకొచ్చాడు.

"తలుపు! తలుపు!"

శ్రీనివాసరావు ఆ ఇద్దరివంకా తిరిగి మాట్లాడవద్దని సంజ్ఞ చేసి వెళ్ళి తలుపు తెరిచాడు.

"ఏమిటిదంతా?" అన్నాడు కలెక్టరుగారు అనుమానిస్తూ.

"పోయింది! తప్పించుకుపోయింది! బారెడు తాచు!"

"తాచు వచ్చిందా ఏమిటి దొడ్లోకి?" అన్నాడు కలెక్టరు పెళ్ళాంవంక తిరిగి.

"ద్రౌపది గుటకవేసి ఔనంది!"

"ఆవిడే చూసింది! తాచు తాచని కేక పెట్టింది. నేను దబదబా దిగి వస్తుండగా, ఈ వినా—గణపతిగారు కనపడ్డాడు. ఇద్దరం వచ్చాం లోపలికి. పోయింది! ఎటు తప్పించుకుపోయింది! పాపం, ఆమె భయంతో వణికిపోయింది!"

"దొడ్డి తలుపేశారేం!"

"తప్పించుకు పోతుందని. నాకు పాము మంత్రం తెలుసు లెండి! కనపడితే పట్టుకోగలను!...సరే, వెళ్ళి పడుకుంటాం! ఈ సారి ఈ దొడ్లో ఆ తాచు కనపడితే చితక పొడి చేస్తాను!" గణపతి ఒక గుటక వేశాడు.

శ్రీనివాసరావు బయటికి వెళ్ళిన తరవాత కుంటటం మొదలు పెట్టాడు. బెణుకు! ఫరవాలేదు. ఇక తాచు భయం లేదు!